# ముప్పదియొకటవ ప్రసంగము.

18 సంవత్సరములకు పూర్వము ఒకమారు శ్రీప్రకాశానందులవారు 'వాంసదా' వెళ్లియుండిరి. 'వాంసదా' మహారాజుగారితో జరిగిన సంభాషణలో మహారాజుగారు ఇట్లనిరి:— "వచ్చుచుండు ప్రతిసన్యాసియును, సత్రమనియో, పాఠశాలలనియో, కుంభోత్సవములో సంతర్పణ చేయవలెననియో ఏదియో ఒకవంకను ధనమును కోరుదురు. ఆధనముతో వారు వైభవోపేతముగా జీవితమును గడుపుదురు. అందుకు కారణమేమి?"

## సన్యాసులు పూర్వము—ఇప్పుడు

స్వా.ప్ర. :—పూర్వము మీవంటిరాజులును, యాజ్ఞవల్క్యునివంటి సాధుగురువులగు ఋషులును సంపదనంతయును త్యజించి సన్యసించెడివారు. అన్నివైభవములను చూచియుండుటచే సదసద్వివేకముద్వారా మాయికపదార్థములపట్ల వీతరాగులయి ద్రవ్యాదులయందు మోహమును ఎంతమాత్రమును కలిగియుండెడివారు కాదు. సన్యాసమునకుకూడ మూల్యము ఉన్నది. మహాత్ముడగు ఇబ్రహీము ఒక ఫకీరు తనస్థితినిగురించి విచారించుచుండగా చూచెను. ఈమనుష్యుడు ఫకీరువేషమును మూల్యమును చెల్లించకుండ ధరించెననియు, ఆతడు ఫకీరుజీవితము - సన్యాసిజీవితము దారిలో దొరకునదిగా తలచెననియును అనుకొనెను. ఊరికే దొరకినసంపదచే ఇట్టి ఫలితమే కలుగును కదా!

ఈవిషయమును ఆతడు ఆఫకీరుకు చెప్పెను. ఆఫకీరు ఇబ్రహీమును అడిగెను. ఫకీరు జీవితము అమ్మబడునా?

ఇబ్ర:—అవును. నేను బలఖారాజ్యమును ఇచ్చి ఫకీరుజీవితమును తీసికొంటిని.

భర్తృహరి మహారాజుకూడ ఇట్టివాడే. భర్తృహరి మహారాజును ఎరిగియున్న ఒకరాజు ఆయనసన్యాసము తీసికొనినతరువాత ఆయనను కలసికొనుటకు వచ్చెను. ఆయన ధరించిన చిరుగులబొంత మొదలగువానిని చూచి చెప్పెను:—ఇట్టి దారిద్ర్యమును ఎక్కడనుండి సంపాదించితిరి.

భర్తృహరి జవాబుచెప్పెను:—

"నీరాజ్యముకంటె పెద్దరాజ్యముయొక్క సంపదను ఇచ్చి కొంటిని."

1956వ విక్రమసంవత్సరమున (A. D. 1899 సం॥) పెద్ద కరువు వచ్చెను. ఆసమయమున నేను భూజ్‌యందు చాతుర్మాస్యలు చేయుటకు ఆగియుంటిని. హిందూదేశము అంతయును ఈకరువుతో బాధపడుచుండెను. ఎందరో దిక్కులేనిపిల్లలు అన్నములేక ఆకలితో అలమటించుచు, ఏడ్చుచు తిరుగుచుండెడివారు. ఇట్టిపిల్లలకు కొందరకు సాధువులును, సన్యాసులును కాషాయవస్త్రములు ధరింపజేసి ముండనముచేయించి సాధువులవేషము వేయించెడివారు. తరువాతసంవత్సరము 1957 విక్రమసంవత్సరమున భాద్రపదమాసమున నేను అహమదాబాదులో నుంటిని. నేను ఉన్నచోటు అనాధాశ్రమమునకు దగ్గరగానుండెను. ఆఅనాధాశ్రమము స్థిరమైనదికాదు. కేవలము కరువురోజులకు ఉపయోగపడుటకుమాత్రమే ఆరంభించబడెను. ఆ అనాధాశ్రమము మూసివేయబడు సమయము ఏతెంచిన వెంటనే దానిలోనుండు కొందరు పిల్లలు సాధువులు అయిరి. కొందరు సన్యాసులవద్దకు వెళ్ళి సన్యాసమును తీసికొనిరి. నేటి సాధువులు సన్యాసమును పొట్టగడపుకొనుటకు సాధనముగా నుపయోగించుచున్నారు. నేనుకూడ వారిలో ఒకడను.

జ్ఞానార్ణవమున చెప్పబడినది:—

113

యతిత్వం జీవనోపాయం కుర్వాన్తః కిం న లజ్జితాః ।
మాతుః పణ్యామివాలమ్బ్య యథా కేచిత్ గతఘృణాః ।

“తల్లియొక్క అసభ్యప్రవర్తనను పొట్టగడపుకొను సాధనముగా నేర్పరచుకొని జీవించువాడు సిగ్గులేనివాడుగను, దయాహీనుడుగను తలచబడును. సన్యాసమును జీవనోపాయముగా నేర్పరచుకొను వాడుకూడ అట్టివాడే. అతడు సిగ్గుపడరాదా?”

మాయొక్క ఈప్రవర్తనను శాస్త్రములు నిందించుచున్నవి. కాని మేము సిగ్గుపడుటలేదు.

ఇట్టివారు భిక్షాటనమునకు వేషము వేసికొనెదరు. కావున అందుకు పనికివచ్చువారివద్ద ఏదోవంక పెట్టి ధనమును సంపాదించెదరు. కాని యథార్థమగు వైరాగ్యముకలవాడు రాజ్యము ఇచ్చినను పుచ్చుకొనడు. ఈవిషయమున బుద్ధభగవానుని ఆదర్శము గ్రహించదగినది.

## బుద్ధభగవానుడు.

అవి బుద్ధభగవానుడు సంచారముచేయు రోజులు. ఒకచోట గొల్లలు మేకలమందలను తోలుకొని వెళ్ళుచుండిరి బుద్ధుడు వారిని అడిగెను:—“ఈమేకలు అన్నియును ఎక్కడికి తీసికొనివెళ్లుచున్నారు?”

గొల్లలు చెప్పిరి:—బింబిసారమహారాజులు యజ్ఞము చేయుచున్నారు. ఆయజ్ఞమునందు ఆహుతి ఇచ్చుటకై మేము ఈమేకలను తీసికొని వెళ్ళుచున్నాము.

బుద్ధభగవానుడు యజ్ఞమునకు వెళ్ళవలెనను కోరికతో ఆ గొల్లలవెనుక నడచెను. ఒకమేక కుంటిది అగుటచే సరిగ నడువలేక వెనుకబడిపోవుచుండెను. గొల్ల కర్రతో కొట్టిన కొంచెముదూరము కుంటుచుకుంటుచు తొందరగనడచుచు మరల మామూలుగా వెనుకబడిపోవుచుండెను. మరల దెబ్బతినుచుండెను ఇదిచూచి బుద్ధభగవానుని హృదయము దయతో నిండిపోయెను. ఆయన గొల్లతో

నిట్లనెను:- "సోదరా! ఈమేకను భుజములపై నెక్కించుకొని మోసికొని నీవెనుక నడచెదను. నీవు వెళ్ళుచోటికే నేనును వచ్చుచున్నాను. నీగమ్యము చేరినంతనే మేకను నీకు స్వాధీనము చేయుదును."

గొల్ల చెప్పెను:—"సరే."

అంతట బుద్ధభగవానుడు దానిని మోయుచు నడచెను.

బింబిసారమహారాజు రాజధాని వచ్చినంతనే గొల్లలు ఒకచోట విడిదిచేసిరి. బుద్ధుడు ఆమేకను గొల్లకు అప్పగించెను. తరువాత బుద్ధభగవానుడు బింబిసారుని యజ్ఞసమారంభమునకు వెళ్ళి రాజును కలిసికొనవలెనను కోరకను ప్రకటించెను. రాజు లోపలికి వచ్చుటకు అనుమతి నిచ్చెను. బుద్ధుడు రాజునెదుటకు వెళ్ళి ప్రశ్నించెను:-"మహారాజా! ఈయజ్ఞమును ఎందుకు చేయుచున్నారు?

రాజు:—స్వర్గసుఖమునుకోరి చేయుచున్నాను.

బుద్ధుడు:—నరమేధము చేసినచో ఏమిఫలము లభించును?

రాజు:—స్వర్గముకంటె ఉన్నతమగు ఫలము కలుగును.

బుద్ధుడు:—ఇదిగో. నాశరీరము సంసిద్ధముగా నున్నది. ఇన్ని జీవులను చంపి ఆహుతి ఇచ్చుటకన్న ఒకజీవుని ఆహుతిఇచ్చి నీకు కావలసిన ఉన్నతపదవిని పొందుము.

ఈమాటలు వినినంతనే రాజునకు ఆశ్చర్యము కలిగెను. ఆయన బుద్ధునివైపు ఏకాగ్రదృష్టితో చూచుచు ఉండిపోయెను. బుద్ధభగవానుని తేజమునకును, ప్రభావమునకును ఆతడు లోబడిపోయెను. రాజు ఆయన కాళ్ళపైబడి శరణువేడెను. అంతటితో ఆయజ్ఞమును ఆపివేసెను. బుద్ధభగవానుడు రాజునకు తత్త్వోపదేశము కావించెను. రాజు వారికి శిష్యుడయ్యెను. అంతట బుద్ధుడు అచ్చటనుండి వెళ్లుటకు సంసిద్ధుడయ్యెను.

ఇదిచూచి రాజు పలికెను:-"తమరు ఎక్కడికి వెళ్ళుచున్నారు? ఈరాజ్యమును తమకు అర్పించుచున్నాను. తమరు ఈదిసుగుట్టలను

విడచి మంచిబట్టలు ధరించుడు. ఇచ్చటనే ఉండి రాజ్యమును అనుభవించుడు.''

బుద్ధుడు చెప్పెను:—నాకు రాజ్యము ఉండెను. ఆసుఖము నాకు తుచ్ఛమైనదిగను, అనిత్యమైనదిగను తోచెను. కావున ఆరాజ్యమును త్యజించి నేను మహత్తమమును, అవినాశియునగు సుఖమును వెతకుటకు బయలుదేరితిని. రాజ్యమునందు సుఖము కలుగును అను భావము ఇంచుకంతయును నాకు కలుగ లేదు.

ఈవిధముగా చెప్పి బుద్ధుడు వెళ్లిపోయెను.

ఈప్రకారము మహాత్ములకు మాయికసుఖములు తుచ్ఛములు అను అనుభవము కలుగును. కావున వారు ఆసుఖములను గ్రహించరు. నేడు ముముక్షువులు చాలతక్కువ, బుభుక్షువులు మాత్రము ఎక్కువ.

### అధికారముననుసరించి వస్తువును గ్రహించవలెను.

బ్రహ్మవిద్యను సంపాదించుటకుకూడ పరంపరాగతమగు యోగ్యత మొదలగునవి ఆవశ్యకములు. మహాత్ములు మహద్వస్తువును గ్రహించెదరు. తుచ్ఛులు తుచ్ఛవస్తువునే గ్రహించెదరు.

భర్తృహారి చెప్పెను:—

స్వల్పం స్నాయువసావశేషమలినం నిర్మాంసమప్యస్థి గోః
శ్వా లబ్ధ్వా పరితోషమేతి న తు తత్తస్య క్షుధాశాన్తయే ।
సింహో జమ్బుకమఙ్కమాగతమపి త్యక్త్వా నిహన్తి ద్విపం
సర్వః కృచ్ఛ్రగతోఽపి వాఞ్ఛతి జనః సత్త్వానురూపం ఫలమ్ ॥

“కొంచెముమాత్రమే స్నాయువును, క్రొవ్వును మిగిలియుండి మాంసములేని ఎద్దుఎముకను సంపాదించి కుక్క సంతోషించును. ఆకలి తీరునా, తీరదా అనికూడ విచారించదు. కాని సింహము మాత్రము దగ్గరకు వచ్చిన నక్కను విడచి ఏనుగునే వధించును.

ఈవిధముగ ఎల్లజీవుల కష్టములు సహించవలసి వచ్చినను తమ బలమునకు తగిన ఫలమునే కోరుదురు."

మహా:—అయిన వీరి సన్యాసధర్మము భంగము నొందుటలేదా?

స్వా. ప్ర. :—వీరికి సన్యాసధర్మముతో సంబంధము లేదు. ముష్టిఎత్తుకొనుటకు మాత్రమే వీరు సన్యాసివేషమును వేసికొనెదరు.

## నిజమగు సన్యాసి,

మహా: — అయితే తమకు ఎరిగిన నిజమగు సన్యాసి ఎవరైన కలరా?

స్వా. ప్ర. :— ప్రస్తుతము సౌరాష్ట్రలో పీఠడియాలో ఉన్న స్వామిశ్రీ నిత్యానందులవారు అట్టివారే. వారు చాల పవిత్రులు. ఇంకను ఉండిఉందురు. కాని నాకు తెలిసినవారుమాత్రము వీరు ఒక్కరే.

అటుతరువాత ఒకసంవత్సరమునకు మహారాజుగారు రాజకోట వెళ్లిరి. అప్పుడు శ్రీప్రకాశానందులవారు వాఘజీభాయి సరోవరమార్గమున నిర్మింపబడిన కుటీరములో బసచేసియుండిరి. మహారాజుగారు స్వామివారిని కలసికొనుటకు అచ్చటికి వచ్చియుండిరి. ఏకాంతముగానున్న కుటీరమును చూచి మహారాజుగారు ఇట్లనిరి:— ఇది ఋష్యాశ్రమమువలె శాంతిమయముగానున్నది. ఆహా! ఎంతశాంతముగా నున్నది. ఇచ్చటనే ఉండవలెనని నాకు ఎంతయో అభిలాషగా నున్నది.

స్వామిప్రకాశానందులవారు అడిగిరి:— మీవంటి మహారాజభవనములలో నుండువారికి కుటీరములో నుండవలెనని అభిలాష కలిగినదా? అయిన నాకు రాజభవనము అనిన ఎంతయోప్రీతి. ఆకుటీరమున స్వామిశ్రీనిత్యానందులవారి ఫొటో ఉండెను. మహారాజుగారు ప్రశ్నించిరి:—"ఈ ఛాయాచిత్రము ఎవరిది?"

"గతసంవత్సరము శ్రీనిత్యానందులవారినిగురించి చెప్పితిని కదా! ఇది వారిదే" అని ప్రకాశానందులవారు చెప్పిరి.

అంతట వారు అడిగిరి:— పీఠడియూ ఇక్కడికి ఎంతదూరము? మోటారుమార్గమున వెళ్ళవచ్చునా?

స్వా. ప్ర. :— ఇక్కడికి నలుబదిరెండు మైళ్ళు కలదు. మోటారు వెళ్లును. "తమరుకూడ పీఠడియూ వచ్చెదరా?" అని మహారాజుగారు అడిగిరి. స్వామివారు అనుమతించిరి. రెండురోజుల తరువాత స్వామిశ్రీప్రకాశానందులవారును, మహారాజుగారును రాజకోటనుండి మోటారులో పీఠడియూ వెళ్లిరి.

## శిష్టాచారము.

మహారాజుగారు నిరాడంబరులు. వారు సామాన్య దుస్తులను ధరించియుండుటచే ఆయన మహారాజుగారని అపరిచితులు తెలిసికొనలేరు. అయినను ఆయనయొక్క తేజోవంతమగు ముఖమును చూచి ప్రకాశానందస్వామివారిని నిత్యానందస్వామివారు ప్రశ్నించిరి:— "వీరు ఎవరు?"

స్వా. ప్ర. :— వీరు 'వాంసదా' మహారాజు. తమరు అడిగినందున చెప్పవలసివచ్చినది. వీరు కడు నిరాడంబరులు, ధర్మనిష్ఠులు. సామాన్యవేషమును ధరించుదురు సామాన్యమానవునివలె వర్తించుదురు. "తాను రాజు" అని ఎవరికిని తెలియనీయరు.

స్వా. ని. :— యథార్థమే. తమతోనుండుటచే వీరును ఉత్తములే అయియుందురని నాకు తోచినది. కానిచో వీరికిని తమకును సాంగత్యము ఉండెడిది కాదుకదా! రాజు తన రాజ్యగర్వమును వీడి సంతువద్దకు వెళ్లినప్పుడే సంతులు కృపజూపెదరు.

గౌరాంగప్రభువులు పూరీజగన్నాథమున ఉండిరి. ఆసమయమున కటకనగరాధిపతియగు ప్రతాపరుద్రమహారాజు తన కులగురు

వగు భట్టాచార్యులను జగన్నాథమందిరమునకు వలయు ఏర్పాట్లు చేయుటకు పూరీలో ఉంచెను మహారాజుల ప్రతినిధిగా ఆయన గౌరాంగప్రభువులకును, వారిభక్తులకును సేవచేయుచుండెను. రథయాత్రరోజు వచ్చినందున కుటుంబపరివారపరివారము ప్రతాపరుద్ర మహారాజు తనకుటుంబముతోను, పరివారముతోను సహా జగన్నాథపురమునకు వచ్చెను. ఆయన కులగురువులను పిలిపించి సంతులు, సాధువులు, పండితులు దర్బారులోనికి వచ్చి దర్శనమునిచ్చి ఆశీర్వదించునట్లు ప్రముఖులగు గౌరాంగులవారినికూడ రప్పించి తనను కృతార్థుని చేయించమని చెప్పెను. కాని మహాప్రభువులగు గౌరాంగులకు రుచికరములగు పదార్థములను తినవలెననికాని, సన్మానము పొందవలెననికాని, ద్రవ్యాదులను ఆర్జింపవలెననికాని కోరిక లేకుండెను. ఇక వారు దర్బారుకు ఎందుకు వెళ్ళెదరు?

పైమూడు విషయములను మహాప్రభువులు త్యజించి,వీతరాగులయి సన్యాసమును స్వీకరించియుండిరి. అంతేకాకుండ శాస్త్రములయందు సన్యాసి రాజుదర్శనముచేయుట పూర్తిగా నిషిద్ధము. రాజుకు ఈసంగతి ఏమి తెలియును? ఆనాటివరకును వారు యథార్థమగు సన్యాసిని చూచియుండలేదు. కావుననే ఆయన భట్టాచార్యులను ప్రభువులవద్దకు పంపిరి. భట్టాచార్యులు ప్రభువులవద్దను వెళ్ళి భయపడుచు చెప్పిరి:- ప్రభూ, ప్రతాపరుద్రమహారాజులు తమకుటుంబముతోను, పరివారముతోను రథయాత్రకు ఇచ్చటకు వచ్చిరి. తమదర్శనమునకు ఎంతయో ఉత్సాహపడుచున్నారు. తమరు దయచేసి వారికి తమదర్శనమును ఇచ్చి కృతార్థులను చేయుడు. ప్రభువులు చెవులు మూసికొని పలికిరి:- శ్రీవిష్ణు, శ్రీవిష్ణు. తమరు పండితులు అయికూడ ఇంత ధర్మ విరుద్ధమగు కృత్యమును ఎందుకు చేయుచున్నారు. సన్యాసి రాజదర్శనముచేయుట పాపము అని చెప్పబడినది.

తమరు మావార్తయందికూడ నన్ను ధర్మభ్రష్టుని చేయుటకు ఇట్టి అభిప్రాయమును ప్రకటించినచో ఇక్కడ మాధర్మమును రక్షించువారు ఎవరు? ఇక మేము పూరీని విడచుట యుక్తము. అహా! సంసారవిషయములయందు చిక్కుకొనిన రాజుల దర్శనమా! ఎంత విషాదకరమైన వార్త చెప్పిరి? భట్టాచార్యులుగారూ నన్ను క్షమించండి. ఇంతలో ప్రతాపరుద్రుని సామంతరాజగు రాయరత్న రామానందుడు విద్యానగరమునుండి ప్రభువులదర్శనమునకు వచ్చెను. వారిని చూచి ప్రభువు ఒక్కమారు లేచి నిలబడెను. ప్రణామము చేయుటను వంగిన రామానందుని గాఢాలింగనముచేసికొని పలికెను:-

"ఇపుడు నాకు రాముడు లభించెను. ఆనందసహితుడగు రాముడు. ఇక మాఆనందమునకు హద్దులేదు."

ఇదిచూచి భట్టాచార్యులు ఆశ్చర్యపడిరి. ఇట్టిరాజుల అందరి సేవను పొందెడివాడును, తాను ఉన్నరాజ్యమునకు అధికారియును అగు రాజును కాదని సామాన్యుడగు రాజుయందు ఎంతప్రేమ చూపుచున్నారు? అచ్చటినుండి భట్టాచార్యులు ప్రతాపరుద్రునివద్దకు వెళ్ళి చెప్పెను:- నేను ఎన్నిమారులు ప్రార్థించినను వారు తమను కలిసికొనుటకు అంగీకరించలేదు. రాజదర్శనము చేయనని వారి ప్రతిజ్ఞ. ప్రతాపరుద్రుడు ఎంతయో బాధాపూరిత హృదయముతో పలికెను:- వారు అట్టిప్రతిజ్ఞను చేసినచో నేనుకూడ ప్రతిజ్ఞను చేయుచున్నాను. ప్రభువుల పూర్ణకృపను అయినను పొందెదను. లేదా శరీరమునైనను త్యజించెదను. ఇది గమనించి భట్టాచార్యులు చెప్పిరి:-

"మహారాజా, తమరు చింతించకుడు. ప్రభువులు తమయందు తప్పక కృపను ప్రదర్శించెదరు. రామానందరాజు అచ్చటికి వచ్చియుండెను. ఆతడు ప్రభువుల దర్శనమునకు వచ్చెను. వారిని ప్రభువులు స్వయముగా కౌగలించుకొనిరి. ప్రభువులు దయాసముద్రులు. తమరు ఒకపని చేయుడు. రాజలాంఛనములతో వారి దర్శనము

చేయుట యుక్తము కాదు. రథము మార్గమున విశ్రాంతికి ఆగినప్పుడు ప్రభువులు ఆపరిసరములలో విశ్రమించుచుందురు. అప్పుడు వారి చరణములపై బడి భక్తియుక్తమగు శ్లోకమును పలికిన తమ మనోవాంఛితము ఈడేరును. ఆవిధముగనే రథయాత్రయందు మార్గమధ్యమున రథము నిలచెను. ఆసమయమున పరిసరోద్యానమున ప్రభువులు అర్ధనిమీలితనేత్రులయి విశ్రమించియుండిరి. అంతట భట్టాచార్యుల సంకేతమును పొంది ప్రతాపరుద్రుడు తనరాజవస్త్రములను పరిత్యజించి ఛత్ర, చామర, మకుటాదిరాజ్యచిహ్నములను విసర్జించి సామాన్య వస్త్రమును ధరించి, పాదరక్షలులేని పాదములతో ప్రభుదర్శనమునకు బయలువెడలెను. నియమానుసారము అంగరక్షకులు వెంబడించిరి. కాని వారినికూడ ఆపివేసెను. తాను ఒక్కడే ప్రభువుల వద్దకు వెళ్ళెను. మొదట కొంచెము కంగారుపడెను. కాని నెమ్మదిగా వెళ్ళి ప్రభువుల కాళ్ళుపట్టుకొని నెమ్మదిగా పాదసేవ చేయదొడగెను. కాళ్ళుపట్టుచు ప్రతాపరుద్రమహారాజు గోపికాగీతములను పాడ మొదలిడెను. వానిని విని ప్రభువులు వెంటనే లేచి కూర్చొనిరి. రాజును ఆలింగనము చేసికొని ఇట్లు పలికిరి. "ఆహా! మహాభాగ్యము. ధన్యుడను. నేడు ప్రేమామృతమును పానము చేయించి నన్ను కృతకృత్యులను చేసిరి. తీమరు ఎవరు? స్వయముగావచ్చి నాయందు ఏల ఇంత నిర్హేతుకకటాక్షమును ప్రకటించిరి?

రాజు చెప్పెను:—"ప్రభూ! నేను తమ దాసానుదాసుడను అవవలెనను కోరికతోనున్న ఒక అకించనుడగు సేవకుడను. నేడు నాకు ఏమి లభించలేదు? తమ ప్రేమాలింగనము లభించినతదుపరి నాకు సంసారమున పొందవలసిన వస్తువు మరియొకటి ఏదైన కలదా? నేడు నేను ధన్యుడనైతిని. ఇన్నిరోజులనుండియు జగన్నాథుని సేవించిన సేవలకు నేడు ఫలితము లభించినది. తమ శ్రీచరణములయందు

నాప్రేమ స్థిరముగానుండునట్లు కరుణించుము. [ఇదియే ప్రతాప రుద్రుడు తమచరణములపైబడి ప్రార్థించుచున్నాడు." ప్రభువులు ఎంతయో సంతోషించిరి.

మహాత్ముడగు కబీరుచెప్పెను:–

"దివ్యరసపానము, పరువు ప్రతిష్ఠలకు ప్రాకులాడుట– ఈ రెండును ఏకకాలమున సంభవించవు. ఒకవరలో రెండు కత్తులు ఇముడునా?"

ఈవిధముగనే ప్రతాపరుద్రుడు రాజ్యగర్వముతో నున్నంత కాలము ఇతరవ్యక్తులద్వారా సందేశములను పంపుచుండెను. అట్లు చేయుచున్నంతకాలము ఆతనికి ప్రభుదర్శనము లభించలేదు. అభిమానములేని భక్తునివలె ప్రభువుల శరణుజొచ్చినప్పుడే ప్రభువు ఆతనిని కృపతో జూచెను."

అనంతరము శ్రీనిత్యానందులవారు ఇట్లు చెప్పిరి. :—

"అయితే ఇప్పుడే దర్బారులోనికి కబురు పంపండి. వారికి ఆలస్యముగా తెలిసినచో కోపపడెదరు.'' అని ఒకవ్యక్తిని దర్బారులోనికి పంపెను. ఆ అవసరములేదని వాంసదా మహారాజు చెప్పెను. కాని స్వామివారు మనుష్యుని పంపిరి.

సమాచారము అంది మూల్వాలారాజు వచ్చిరి. మహారాజుగారు ఇతరజనులతోపాటు జంబుఖానాపై కూర్చొనియుండుటచూచి సిల్కుజంబుఖానాపై కూర్చొనమని వారిని కోరిరి.

ఇదికాంచి నిత్యానందులవారు పలికిరి :— నేను మొదటనే వారికి చెప్పితిని. కాని వారు కూర్చొనలేదు.

స్వా. ప్ర. :— నేను మొదట వాంసదా వెళ్ళినప్పుడు అచ్చట రహస్యముగా నుంటిని. తొమ్మిదిరోజులవరకును మహారాజుగారికి తెలియలేదు. పదవరోజున నేను వెళ్ళిపోవలసిన సమయమునకు

వారికి తెలిసెను. వెంటనే వారు వచ్చిరి. కాని వారిని నేను గుర్తించ లేదు. కాని సమీపమున కూర్చొనినవారు "మహారాజుగారు విచ్చేసిరి" అని చెప్పిరి. నేను క్రిందమట్టిలో కూర్చుని ఉంటిని. వారుకూడ అక్కడనే వచ్చి కూర్చొనిరి. అంతట నేను వారితో నిట్లంటిని:- "మీరు దుమ్ములో కూర్చొనవలసివచ్చెను."

వారు సమాధానము చెప్పిరి:— నేను ఏదో ఒకరోజున దానిలో కలియవలసియున్నది.

## మహాపుణ్యాత్ములగు రాజులకు మాత్రమే మృత్యువు జ్ఞాపకము ఉండును.

శ్రీనిత్యానందస్వామివారు ఈమాటలు విని చాల సంతోషించి ఇట్లనిరి:- "మృత్యువు రాజులకు జ్ఞాపకమేరాదే!"

ఒకప్పుడు బలఖ్ బుఖారా చక్రవర్తి అరణ్యముగుండ పాలకీలో కూర్చొని వెళ్లుచుండెను. వెళ్ళినకొలది మార్గము చాల ఇరుకుగా నుండెను. అచ్చట ఒక చచ్చిన ఒంటె పడియుండెను. పాదుషా పాలకీలో ఉండెను. చచ్చినఒంటె దారిలో పడియుండుట చూచి పాలకీమోయువారు ముందుకు నడచుట మానివేసిరి.

పాదుషా అడిగెను:— "ఎందుకు ఆగిరి?"

వారు చెప్పిరి:— "త్రోవలో ఒంటె చచ్చిపడియున్నది."

పాదుషా చెప్పెను:— "లేపండి, కాస్త."

పాలకీమోయువారు పలికిరి:— హుజూర్, అది చచ్చిపోయినది.

పాదుషా అడిగెను:— "చచ్చిపోవుట అనగానేమి?"

పాలకీమోయువారు చెప్పిరి:— శరీరమునుండి జీవము పోయినచో చచ్చిపోయినదని చెప్పుదురు.

అంతట పాదుషా పాలకీనుండి దిగి ఒంటెవద్దకు వచ్చెను. ఆఒంటె కొంచెమైనను కదలకుండను, మెదలకుండను ఉండుట ఆతడు

చూచెను. దాని మృతదేహమునుండి దుర్గంధము బయలువెడలుచుండెను. ఈస్థితిచూచి పాదుషా ఆలోచించసాగెను:-

"జీవుడు పోయినతరువాత శరీరమునకు ఇట్టిస్థితి పట్టునా? నాకుకూడ ఏదో ఒకరోజున ఇట్టిస్థితియే కలుగనలసివచ్చినచో రాజ్యము, ధనము, సంపద మొదలగునవి అన్నియును ఎందుకు? "నేను ఇప్పటినుండియు దేవుని సేవించుదును."

ఇట్లు చెప్పి రాజధానికి వెళ్ళుటకు బదులుగా ఆతడు ఫకీరువేషమును ధరించి అరణ్యమునకే వెళ్ళిపోయెను. బుద్ధభగవానుడుకూడ ఈవిధముగనే శవమునుచూచి వైరాగ్యమును పొందెను. అనంతరము రాజ్యమును త్యజించి సత్యమును శోధించుటకు సన్యాసమును పొందెను.

ఈవిధముగ రాజులకు మృత్యువు జ్ఞాపకమువచ్చినచో వారు మహాపురుషులు అని వేరుగా చెప్పనక్కరలేదు.

పిదప మూళ్వాలారాజుగారు మహారాజుగారిని నేడు ఇచ్చట ఉండుటకు అనుగ్రహించుడని కోరిరి. ప్రకాశానందస్వాములవారిని ఆజ్ఞాపించమనికూడ చెప్పిరి. కాని ప్రకాశానందస్వాములవారు ఇట్లు పలికిరి:- "వీరి పరిస్థితినిపట్టి వీరిని ఉండమని పట్టుబట్టరాదు."

మూడునాలుగు సంవత్సరములకు పూర్వము 11 సంవత్సరములుకల అత్యంతసుందరుడగు వీరికుమారుడు బొంబాయిలో అపెండిసైటిసుకు ఆపరేషను జరుగుచుండగా ఆపరేషనుబల్లమీదనే చనిపోయెను. అప్పుడు వీరిహృదయమునకు ఎంతయో ఆఘాతము కలిగెను. అయినను సంస్కారియగుటచే ఎంతయో ధైర్యమును వహించెను. ఈమధ్యనే వీరితమ్ముడు చనిపోయెను. ఆసోదరునిభార్య మహాపతివ్రత. సతీదేవివంటిది. ఆదుఃఖముతో మృత్యువును ఎదురుచూచుచున్నది. వీరికి ఆపదమీద ఆపద వచ్చుచున్నది.

ఈమాటలు విని నిత్యానందుల వారు గద్గదస్వరముతో నిట్లనిరి:- పాంచభౌతిక దుఃఖములు ఎన్ని కలిగినను వీరిని ఏమియును కృంగదీయ లేదు. శ్రీమద్భాగవతమున ఒకకథ యున్నది:-

పూర్వకాలమున చిత్రకేతుడను చక్రవర్తి కలడు. ధరిత్రి వారికోరికలను అన్నిటిని పూరించుచుండెను. ఒక శుభముహూర్త మున మహాత్ముడగు అంగిరసుడను ఋషి సంచారముచేయుచు దైవే చ్ఛచే ఆరాజునింటికి వచ్చెను. రాజు వారికి గొప్ప స్వాగతమిచ్చెను. ఋషికి ఉన్నతాసనము సమర్పించి రాజు వినయముతో వారికి నమ స్కరించి భూమిపై వారియెదుట కూర్చొనెను. ఋషి వారిని అడిగెను. ఓరాజా! మనస్సు ఎందుకు విచారించుచున్నది? చిత్రకేతుడు చెప్పెను:- స్వామీ! నా రాజ్యమునందలి ఐశ్వర్యము లోకపాలురు కూడ పొందగోరుదురు అయినను ఆకలిదప్పికలతోనున్న వానికి రాజ వైభవము ఆనందమును కలుగజేయనట్లు నేను అపుత్రుడను 'అగు టచే రాజవైభవము నాకు ఆనందమును కలుగజేయుట లేదు. కుమా రులు లేనందున పూర్వులతో పాటు నేనును నరకమునకు పోవుదును అను భయము కలుగుచున్నది. కావున నన్ను రక్షించి అపుత్రుడ నగు నాకు సంతానమును కలుగజేసి నన్ను ఉద్ధరించుము.

'అపుత్రస్య గతిర్నాస్తి' అని ధర్మశాస్త్రములు ఘోషించు చున్నవిగదా! దయాసముద్రుడగు అంగీరసుడు ఆతనిని ఉద్ధరించు టకు త్వష్టృయజ్ఞమును చేసెను. యజ్ఞావశిష్టమగు చరువును రాజు యొక్క ప్రథమభార్యయగు కృతద్యుతిచే భుజింపజేసెను. రాణి గర్భ వతియయి సుముహూర్తమున ఒకకుమారుని ప్రసవించెను. రాజు ఆనందముతో సత్పాత్రులగు బ్రాహ్మణులకు అనేకములగు దాన ములను చేసెను.

కృతద్యుతి తనకుమారునిపట్ల వాత్సల్యముతో పొంగిపోవు చుండుటచూచి సవతులగు ఇతరరాణులు తమకు సంతానము లేనం

దున కలిగిన శోకముతోను, ఈర్ష్యతోను లోలోన బాధపడుచుండిరి. సంతానవతియగు తన మహారాణిని చిత్రకేతుమహారాజుకూడ మిక్కిలి గౌరవముతో జూచుచుండెను. ఇదికూడ ఇతర రాణుల ద్వేషమును పెంచెను. ద్వేషముచే బుద్ధి నశించి, దారుణహృదయులయి ఆ అసహన శీలులు అగు సవతులు రాజకుమారునికి విషము పెట్టిరి. అంతట రాజ కుమారుడు మృతినొందెను. తన ప్రియతముడగు కుమారుడు మృతి నొందినవార్త రాజుకు అపరిమిత శోకమును కలుగజేసెను. ఆతడు నడుచుచు, లేచుచు, స్నేహానుబంధముచే అనుక్షణము పెల్లుబుకుచున్న శోకముచే విహ్వలుడయి మూర్ఛను పొందుచు, ఎట్టెట్టనో కుమారుని మృతశరీరమువద్దకు వెళ్లి బిగ్గరగా ఆక్రందనము చేసెను. ఏవిధము గను ఆయన తన మనస్సును నిలుపుకొనలేకపోయెను. రాజు ఇట్లు దుఃఖముతో మూర్ఛనొందుచు, అనాథునివలె నుండుటగాంచి సహజ దయాసముద్రుడగు బ్రహ్మతనూజుడు ఆంగీరసుడు నారదునితో మారువేషమున అచ్చటికి వచ్చెను. రాజకుమారునిచెంత శవమువలె పడియుండెను. శోకము ఆతనిని క్రుంగదీసివేసెను. అట్టి రాజునకు ఆంగీరసమహర్షి శాస్త్రవాక్యములను ప్రమాణముగాజూపి ఉప దేశించెను.

"ఓ రాజేంద్రా! నీవు శోకించుచున్న ఈతనికిని నీకును కల సంబంధము ఏమి? పూర్వజన్మమున ఇతనికిని, నీకును ఎట్టి సంబంధము ఉండెను? ఇప్పుడు ఇట్టిసంబంధము కలదు! ముందు ఎట్టి సంబంధము ఉండును?"

"తత్త్వవిచారము చేసినచో నదీప్రవాహముచే ఇసుకరేణు వులు గుమిగూడుచు చెదరిపోవుచునుండునట్లు, ప్రాణులుకూడ కాల ప్రవాహమున పరస్పరము గుమిగూడుచును. చెదరిపోవుచును ఉం డును. పూర్వజన్మమున పితాదిరూపమున వ్యవహరించిన ప్రాణులే

మరణానంతరము వేరయి ఈజన్మమున అతనికే పుత్రాదిరూపములను పొందును. కొన్ని ఇతరుల పుత్రాదిరూపములను పొందును. వారే జన్మాంతరమున భార్య, శత్రువులు, మిత్రులు మొదలగురూపములను కూడ పొందుదురు. కావున ఈతడు నీకుమారుడు, నీవు ఇతని తండ్రివి అనునది నిత్యనియమము కాదు.''

"యథార్థమునకు అహంకార, మమకారములు అజ్ఞానజన్యములు. మృత్యువు ఎల్లరకును సర్వసాధారణము. జగము మిథ్యఅయినచో ప్రతీతి ఎట్లు అగుచున్నది? నేను తండ్రిని అను ప్రేమాభిమానముకూడ దేనిచే కలుగుచున్నది? అని నీవు ప్రశ్నించవచ్చును. దానికి సమాధానము వినుము. దేవుడు తనమాయచే సమస్తమును సృష్టించెను. దానిచే ప్రతీతి అగుచున్నది. ప్రతీతిచే ప్రాణులపట్ల అభిమానము కలుగుచున్నది.''

కరుణాసముద్రుడగు ముని చెప్పిన అమృతోపమములగు వాక్యముల తత్త్వమును తెలిసికొని రాజు ఊరడిల్లెను. అంతరంగమునందలి బాధచే శోకగ్రస్తమగు ముఖమును చేతితో మూసికొని పలికెను:—

ఓజ్ఞానసంపన్నులగు మహాత్ములారా! అవధూతవేషమున ఇచ్చటికి గుప్తరూపమున వచ్చిన తమరు ఎవరు? మూఢాత్ముడనగు నాకు జ్ఞానప్రకాశమును కలుగజేయుడు.

అంతట అంగీరసమహర్షి పలికెను:— "ఓరాజా! నీకు పుత్రుడు కావలెనని కోరిక కలిగినంతనే ఆకోరికను ఈడేర్చిన అంగీరసుడను నేను. ఈయన సాక్షాత్తు బ్రహ్మకుమారుడగు నారదుడు. నీవు హరిభక్తుడవు. మోహముపొందుట నీకు తగదు. కావుననే కుమారుని మృత్యువుచే కలిగిన శోకమున ఇంత ఎక్కువగా మోహమున చిక్కుపడుట చూచి నీపై అనుగ్రహముతో మేము ఇరువురమును ఇక్కడకు వచ్చితిమి. ఏలనన భగవద్భక్తుడు మోహమును పొందుట యుక్తము కాదు.

మొదట నేను నీవద్దకు ఉత్తమజ్ఞానమును కలిగింపవలెనను అభిలాషతో వచ్చితిని. కాని నీవు సంసారాసక్తుడవగుట గాంచి ఆస సమయమున నీకు పుత్రప్రాప్తియగు నుపాయమును చేసితిని. పుత్రుడు కలవానికి ఏదుఃఖము కలుగునో నీవు అనుభవించితివి. ఈవిధముగనే భార్య, ధనము, గృహము మొదలగు సకలవిధసంపదలును సంతాప కరములుమాత్రమేనని నీవు తెలిసికొనుము. ఓరాజా! సేవకులు, ఉద్యోగులు, బంధువులు, అందరును శోకమును, మోహమును, భయమును వాటిపరిణామమగు బాధను కలుగజేయువారే. అవి అన్నియును నశ్వరములు. స్వప్నములవలెను, మాయవలెను, మనో రథములవలెను అసత్యములు.

మానవుడు కర్మవాసనచే విషయచింతన చేయును. అంతట ఆతని మనస్సునుండి నానావిధములగు కర్మలు జన్మించును. కర్మలు కూడ ఈవిధముగ జూచిన మనస్సునుండియే జన్మించినవని నిర్ణయించ వచ్చును.

అప్పుడు ఆంగిరసమహర్షితోకూడ వచ్చిన నారదుడు తన యోగబలముచే మృతినొందిన రాకుమారుని ప్రత్యక్షముకావించి ఆజీవాత్మతో నిట్లనెను:– "ఓజీవాత్మా!నీతల్లిదండ్రులు, సంబంధీకులు అందరును నీశోకముతో ఎంతయో ఖిన్నులయియున్నారు. అది గమ నించి నీవు మరల ఈకళేబరమున ప్రవేశించి స్నేహయుక్తులగువారి మధ్యను మెలగి నీమిగిలిన ఆయుర్దాయమును పూర్తిచేయుము. తండ్రి ఇచ్చిన వైభవములను అనుభవించి, రాజసింహాసనమునకు శోభను కలుగజేయుము."

ఆజీవాత్మ మునిచెప్పిన ఈవాక్యములను విని శరీరమునందు ప్రవేశించి పితాదిబంధువులను ఉద్దేశించి ఇట్లు పలికెను:—

"నేను కర్మకు అధీనుడనయి దేవ, పశు, పక్షి మనుష్య యోనులయందు తిరుగుచున్నాను. నేను చనిపోవుటచే నాయందు పుత్రిభావముతో మీరు ఎందుకు శోకించుచున్నారు? ఏదియో ఒక జన్మయందు మీ శత్రువును అనుకొని నా మృత్యువుచే ఏల సంతోషించుటలేదు? పుత్రాదిసంబంధము నిత్యము కాదు. మీరుచుండును ఒకప్పుడు బంధువు, ఒకప్పుడు మిత్రుడు, మరియొకప్పుడు శత్రువు అగుట తటస్థించును. ఒకరికిని మరియొకరికిని సంబంధము ఉండదు. జన్మజన్మకును క్రొత్తసంబంధములు కలుగును.

సువర్ణాదిపదార్థము వర్తకులచేతిలో పడి వివిధములగు మార్పిడులను పొందునట్లుగనే జీవుడుకూడ తన శుభాశుభకర్మల ద్వారా అనేకయోనులయందు తిరుగుచుండును. మనుష్యునకును, పశువులు మొదలగు జీవజంతువులకునుకూడ సంబంధము స్థిరముగ నుండదు. సంబంధము ఉన్నంతకాలమే మమత్వముకూడ ఉండును. పశువును అమ్మినపిదప దానియందు మమత్వము ఉండదుకదా!"

ఇట్లు చిత్రకేతుమహారాజకుమారుని ఆత్మ చిత్రికేతుడు మొదలగువారలకెల్లరకును తగిన ఉపదేశమునిచ్చి, శరీరమునుండి బైటికి వెడలిపోయెను. ఆబంధువులు అందరును ఆశ్చర్యముతో స్నేహశృంఖలములను పటాపంచలుచేసి శోకమును విడనాడిరి.

ఈవిధముగ అంగిరసుడును, నారదుడును చేసిన ఉపదేశములచే చిత్రికేతుడు జ్ఞానమును పొంది శోకమోహమునుండి నివృత్తిని పొందెను. వియోగకరమగు మరియొకపదార్థమునందు ప్రేమను కలిగియుండుటచే కలుగు పరిణామము దుఃఖమే. బృహదారణ్యకమును పరికించుడు:—

తదేతత్ప్రేయః పుత్రాత్ప్రేయో విత్తాత్ప్రేయోఽన్యస్మాత్ సర్వస్మాదయమాత్మా । స యోఽన్యమాత్మనః ప్రియం బ్రువాణం బ్రూయాత్

*దన్తరతరం ప్రియం రోత్స్యతీతీశ్వరో హ తథైవ స్యాదాత్మానమేవ ప్రియముపాసీతస య ఆత్మానమేవ ప్రియముపాస్తే న హాస్య ప్రియం ప్రమాయుకం భవతి॥*

"ఆత్మ అన్నిటికంటెను దగ్గర నున్నది. అది పుత్రునికంటెను ప్రియమైనది. విత్తముకంటెను ప్రియమైనది. మిగిలినపదార్థములు అన్నిటికంటెనుకూడ నెక్కువ ప్రియమైనది. ఆత్మవ్యతిరిక్తమగు అనాత్మపదార్థము ప్రియమైనది అని చెప్పువానితో ఆత్మవాది "నీప్రియమగు అనాత్మపదార్థము ఏడ్చుచున్నది." అని చెప్ప గలదు. అట్లు జరుగుటయే అందుకు కారణము. కావున ప్రియమగు ఆత్మతత్త్వమే ఉపాసించదగినది. ఆత్మ ప్రియమైనది అని ఉపాసించు వాని ప్రియపదార్థము ఎప్పుడును నశించదు."

స్త్రీ, ధనాది మాయికపదార్థములు అనిత్యములు. సంయోగ వియోగములు కలవి. వానిపరిణామము దుఃఖము. కాని పరమాత్ముని యందలి ప్రేమ ఏనాడును వియోగమును పొందదు. కావున ప్రభు పరాయణులగుట యుక్తము.

పూర్వకాలమునందలి గొప్పగొప్ప వారికికూడ ఇట్టి ఆపదలు వచ్చినప్పుడు మనము ఎంత?

ఇంతలో ఆస్థానమునుండి టీ మొదలగు ఫలహారములు వచ్చెను. ఫలహారముల తరువాత వాంసదా మహారాజు 'ఇంద్రసింహ్‌జీ' బయలుదేరుచు నిత్యానందులవారిని ఇట్లు ప్రార్థించిరి:—

"మావలన తమకు జరుగుసేవను సెలవిండు."

స్వామి శ్రీనిత్యానందులవారు ఇట్లనిరి:—

"మీ ప్రజలసేవయే మాసేవ. రాజులు తమ ప్రజలను రక్షించవలెను. రాజు ప్రజలకు తండ్రి.తండ్రి కుమారునిచదివించును. అతనికి వినయమును నేర్పును. అతనిని రాబోవు ఆపదలనుండి రక్షిం

*రక్షితాశ్చ ప్రజా యేన తస్మాద్రాజేతి శబ్ద్యతే ।*

"ప్రజలకు అన్నము, వస్త్రము, విద్య, వినయము కలుగజేసి సంతోషపెట్టువాడే రాజు."

ప్రజలు రోగములచే బాధపడుచున్నచో రోగములను పోగొట్టుటకు వైద్యశాలలను నిర్మించవలెను. రోగములు లేనివారికి ఇతరసదుపాయములు చేయవలెను. ప్రజలు ఆరోగ్యముగానున్నచో రాజునకును, రాజ్యమునకును హితముకలుగును. ఆరోగ్యవంతులగు ప్రజలు ఉత్సాహముతోనుందురు. ఉత్సాహముచే రాజ్యము అంతయును సమృద్ధిని పొందును. కావున బీదలగుప్రజల ఆరోగ్యమునందు లక్ష్యము ఉంచుట రాజుయొక్క ముఖ్యకర్తవ్యము.

అనాథాలయములద్వారా బీదలగు జనులను రక్షించవలెను. బీదల చిన్నపిల్లలకును, వృద్ధులకును దిక్కు ఉండదు. వారికి సహాయము చేయువారు ఉండరు. వారిని ఓదార్చువారైన ఉండరు. అట్టి వారలను అనాథాలయములయందుంచి పోషించవలెను. బాలకులు భావిపౌరులగుటచే పెరిగి పెద్దవారయి రాజ్యముపట్ల తమకర్తవ్యములను ఎన్నడును విస్మరించరు. బీదలు చలికాలములో ధరించుటకు సరియగుబట్టలు ఉండకపోవుటచే చలితో బాధపడుచుందురు. వణకుచు చలియొక్క భయంకరమగు చేతుల్లో చిక్కుకొనపోవుదురు. దుఃఖించు ఆబీదలకు తగినట్లు వస్త్రములను ఇవ్వవలెను. అప్పుడే క్షత్రియశబ్దము యథార్థమగును.

అన్నసత్రములను ఏర్పాటుచేయించి వానియందు బీదలకు అన్నము పెట్టించుచో క్షుద్బాధతోనున్న ప్రజలు శాంతినిపొంది ఆశీర్వదించుదురు ఈవిధముగా ప్రజలనుపాలించుట క్షత్రియుని ముఖ్యధర్మము.

*క్షత్రియస్య పరో ధర్మః ప్రజానాం పరిపాలనమ్ ।*
*తస్మాత్సర్వప్రయత్నేన రక్షయేన్నృపతిః ప్రజాః॥*

"ప్రజలను పాలించుట క్షత్రియుని ముఖ్యధర్మము. కావున అన్నివిధములను రాజు ప్రజలను రక్షించవలెను."

బీదలదుఃఖములను పోగొట్టురాజే నిజమగురాజు. ఆతడురాజే కాదు; రెండుచేతులు కల పరమేశ్వరుడు.

పరమధార్మికుడును తన ప్రజలను పోషించుచు, వారిని దుర్మార్గులబారినుండి రక్షించుచుదను, అభయమిచ్చుచును ఉన్నరాజు సాక్షాత్తు బ్రహ్మతో సమానుడు. కావున ప్రజాపాలనమును బీదలకు సహాయము చేయుటయును రాజధర్మము. తనప్రజల మనస్సులను రంజింపజేయురాజు రాజుశబ్దముయొక్క యథార్థమగు భావమును వ్యక్తముచేయుచున్నాడు. జనులలో బాధను పెంచుటవలనకాని, భూమిమీదిజలమును శోషింపజేయుటచేకాని భూమిని వేడిచేయుటచే కాని చంద్రుడు చంద్రుడనబడుటలేదు. జనులకు ఆనందమునిచ్చును. భూమిని శోషింపజేయుటకు బదులు శీతలపరచుచు తన కిరణముల ద్వారా మిక్కిలి దుఃఖించుచున్నవారికికూడా సుఖమును కలుగ జేయుచుండుటచేతనే చంద్రుడు చంద్రుడనబడుచున్నాడు. అటులనే తనబీదజనులను సంతోషపెట్టువాడును, వారియందు దయకలిగి యుండువాడును అగు రాజుమాత్రమే రాజనబడును.

*యథా ప్రహ్లాదనాచ్చన్ద్రః ప్రతాపాత్తపనో యథా ।*
*తథైవ సోఽభూదన్వర్థో రాజా ప్రకృతిరఞ్జనాత్ ॥*

"జనులను ఆనందింపజేయుటచే చంద్రుడనబడును. తపింప జేయుటచే తపనుడు (సూర్యుడు) అనబడును. అటులనే ప్రజలను రంజింపజేయుటచే రాజు అనబడును."

రాజులు చోరాదులచే బాధపడు దిక్కులేనివారి దుఃఖము లను పోగొట్టవలెను. బీదలను ఉద్ధరించుటయే వారిప్రధానవ్రత ముగా భావించవలెను. బీదలను రక్షించువానికంటె ఉత్తముడు మరి యొకడు లేడు.

ఈశరీరము మాంసము, ఎముకలు, మలమూత్రములు మొదలగువానితో నిండియున్నది. కావున సహజముగా ఇది మురికిది. దీనియందు అసహ్యముకలుగుట స్వభావసిద్ధము. ఇది ఛాయవలెను, నీటిబుడగవలెను క్షణములో నశించును. ఈవిషయమును గుర్తెరిగి రాజులు నశ్వరమగు శరీరముకొరకు బీదప్రజలను పీడించరాదు.

సదాచారముతో ప్రజలను రక్షించురాజును ప్రజలు ఎన్నడును ఎదురుతిరుగరు. పైగా వారు రాజును కష్టసమయమున సహాయము చేయుదురు. ఆకారణముచే రాజులు సదాచారసంపన్నులయి ప్రజలకు సహాయము చేయవలెను. బీదలను పోషించియు, యోగ్యులను గౌరవించియు, అనాథులను రక్షించియును నిరాధారులకు ఆశ్రయమునిచ్చియు ఎల్లరకును జీవనోపాధులు కల్పించును. అప్పుడే ప్రజలు ఆతనిని సేవించెదరు. అట్లుచేయుక శుష్కసరోవరమునందలి పక్షులవలె వారిని విడిచినచో అట్టిరాజును ప్రజలు త్యజించెదరు.

ఆర్తుని రక్షించుట, శరణాగతుని రక్షించుట క్షత్రియశబ్దమునకు అర్థము. ఎవరు-వదుఃఖముతో తనకు కలిగిన ఆపదలనుండి తప్పుకొనుశక్తిలేక "ఈతడు మనలను రక్షించును" అను పరిపూర్ణవిశ్వాసముతో ఎల్లప్రాణులును పృథ్వీవల్లభుడగు వీరక్షత్రియుని శరణుజొచ్చెదరు. అట్టి దుఃఖితులను రక్షించకపోయినచో అట్టి నిందనీయుడగు రాజు జీవించుట వ్యర్థము.

కాళిదాసుని వాక్యములు వినుడు:—

*క్షతాత్కిల త్రాయత ఇత్యుదగ్రః క్షత్రస్య శబ్దో భువనేషు రూఢః ।*
*రాజ్యేన కిం తద్విపరీతవృత్తేః ప్రాణైరుపక్రోశమలీమసైర్వా ॥*

"నాశమునుండి రక్షించువాడు క్షత్రియుడు." అని ఉత్తమమగు క్షత్రియశబ్దమునకు అర్థము. ఇది జగత్ప్రసిద్ధము. అందుకు వ్యతిరేకముగా సంచరించువాడు– అనగా ప్రజలను నాశమునుండి రక్షించని

వాడు రాజ్యమును పొందుటకు అర్హుడు కాడు. అతని రాజ్యము, అపకీర్తిచే మలినమయిన ఆతని ప్రాణములును రెండును వ్యర్థములు.

పూర్వకాలము క్షత్రియులు శరణాగతుని రక్షించుటకు నిరంతరము సంసిద్ధులుగా నుండెడివారు. శిబిదృష్టాంతమునుండి ఈవిషయము ధృవపడుచున్నది.

చంద్రవంశమున శిబి అనుపేరుగల రాజు ఉండెను. ఆయన ఒక యజ్ఞమును ఆరంభించెను. ఇంద్రుడును, అగ్నియు ఆతని దయాస్వభావమును ఔదార్యమును పరీక్షించదలచిరి. తమ మాయచే ఇంద్రుడు డేగరూపమును, అగ్ని పావురమురూపమును ధరించిరి. డేగ పావురమును వెంటాడి తరుముచు ముక్కుతో పొడుచుచు, కాళ్ళతో తన్నుచు వచ్చుచుండెను. పావురము భయముతో పారివచ్చి శిబి ఒడిలో కూర్చొనెను. భయముతో వణకిపోవుచున్న దాని ఆకారమును చూచినతోడనే శిబికి దయకలిగెను.

రాజు డేగతో నిట్లనెను:— ఈపావురము నాకు శరణుజొచ్చినది. కావున నీవు దీనిని చంపరాదు. అందుకు బదులుగా నీవుకోరిన విధముగా మరియొకమాంసము నీకు ఇచ్చెదను.

డేగ మనుష్యవాక్కులతో పలికెను:— రాజా! నేను ఆకలితో నున్నాను. ఇది నాఆహారము. దీనిని నాకు విడువుము. లేనిచో నేను చచ్చిపోవుదును. ఇది ధర్మమా?

రాజు చెప్పెను. ఈపావురము నాకు శరణుజొచ్చినది. శరణాగతరక్షణము నాధర్మము. ఆకారణముచే ఈపావురమును నీకు నేను ఇయ్యను. సువర్ణము, భూమి మొదలగునవి దానము చేయువారు ఈభూమిపై చాలమంది కలరు. అది సులభముకూడను. కాని భయభీతునకు అభయము నిచ్చువాడు దొరకుట సులభముకాదు. మహాయజ్ఞముల ఫలముకూడ కాలక్రమమున క్షయమును పొందును కాని

భయగ్రస్తునకు అభయము నిచ్చుటచే కలుగు సత్ఫలము ఎప్పుడును నశించదు అని మహాఋషులు చెప్పుదురు. ధర్మః సత్యాదయాపరః। అని శాస్త్రములు ఘోషించుచున్నవి. సత్యము, దయ ఈరెండును పరమధర్మములు. మనో, వాక్కాయములచే సర్వప్రాణులయందును దయకలిగియుండు క్షత్రియుడు బ్రహ్మలోకమును పొందును. నీకు నీఆత్మ ప్రియమైనది. అటులనే ఇతరునకు ఆతనిఆత్మ (జీవాత్మ) ప్రియమైనది. ఈవిషయమును అంగీకరించి ఈపావురమును బ్రతికి ఉండనిమ్ము. ఈవిధముగా శిబి ఎంతయో నచ్చచెప్పెను.

ఈమాటలు విని డేగ చెప్పెను:— అది నీయభీష్టము అయినచో ఆపావురముతో సమానముగా బరువుకల మాంసము నీశరీరమునుండి ఇమ్ము. రాజు ప్రసన్నభావముతో ఈషరతును అంగీకరించెను. రాజు తన మాంసమును కోసి త్రాసుతో తూచుటకు నిశ్చయించెను. త్రాసులో మాంసమును ఉంచినకొలదియు పావురముయొక్క బరువు పెరుగసాగెను. అంతట రాజు తనశిరమును ఖండించి త్రాసునందుంచుటకు ఖడ్గమును తీసెను. ఉత్సాహానందములతో ఆతడు తనవిధినిర్వహణకు సంసిద్ధుడగుటతోడనే "ధన్యుడవు, ధన్యుడవు" అను ఆకాశవాణి వినవచ్చెను. ఇంద్రాగ్నులు పక్షిరూపములను త్యజించి దర్శనమిచ్చిరి. అనంతరము వారు కోరినవరములనిచ్చి తమతమ నెలవులకు వెళ్ళిపోయిరి. ఈవిధమున శిబిమహారాజు పరోపకారమునకు తన శరీరమును ఉపయోగించి శాశ్వతకీర్తిని పొందెను. తన బీదప్రజలకొరకు జీవించు రాజుల జీవితము కొనియాడదగినది.

బీదలు తమదుఃఖమును మరిచిపోయి, ఆకలిగొనిన అతిథులు ఆతిథ్యమును సత్కారమును పొంది, ఆర్తులగు ప్రజలు సేవను పొంది, జీవులు ఉన్నతిసాధనములను, విశ్రాంతిని పొంది, సుఖించు రాజ్యము నందలి రాజే పవిత్రుడు. ఆరాజ్యమే పవిత్రమగు రాజ్యము. నిరా

ధారులగు జీవులను దేవుడు రక్షించమని రాజునకు అప్పగించును. వారిని రక్షించుటయును, వారి ఔన్నత్యమును చూచుటయును, వారికి అన్నాదులను ఇచ్చి సుఖింపజేయుటయుమాత్రమే రాజు యొక్క ధర్మము.

ప్రజల దుఃఖములు పోయినప్పుడే రాజ్యలక్ష్మి సదుపయోగ మును పొందినదని తెలిసికొనవలెను. బీదలకు ఎల్లవేళల సహాయము లభించవలెను. బీదలసేవయే దేవునిసేవ. ఇట్లు మీరు ప్రజలసేవ చేయుడు. అదియే మాసేవ.

## స్వామివారి నిష్కామత్వము.

పీఠడియానుండి రాజకోటకు మరలివచ్చినపిదప మహారాజు గారు చెప్పిరి. "స్వామివారు చాల ఆనందస్వభావులు."

స్వా. ప్ర. :— కొంతమంది కేవలము ఆనందముతోనే ఉం దురు. స్వామివారు నిష్కామికూడను. వారి ఆశ్రమద్వారమునకు ఎల్లవేళలయందును తాళము వేయబడియుండును. ఇతరగ్రామముల నుండి వచ్చినవారు ఎవరైన లేరనుకొని తిరిగిపోయెదరేమో, జనులు కోపపడెదరేమో నని దర్బారునుండి ఒకరు వచ్చి ద్వారముకడనుండి వ్యక్తికి తాళముచెవిని ఇచ్చెదరు.

## నిష్కామియగు ఫజల్.

తపోనిధియగు ఫజల్ జీవించియున్నరోజులలో బగ్దాదుపాదుషా ఖలీఫాహారూణఅల్‌రసీదు ఒకనాటి సాయంకాలము తనమిత్రునితో నిట్లనెను:—

"నీవు నన్ను ఇప్పుడే అట్టివారిచెంతకు తీసికొనివెళ్ళుము. ఎవరి ద్వారా నాఅంతరంగమునకు శాంతికలుగునో. నేను సంసారజంఝా టముతో విసుగుచెందియున్నాను." ఖలీఫామిత్రుడు ఆయనన్ను

ఆతపోనిధియగు సూఫియార్ ద్వారమువద్దకు తీసికొనివెళ్ళి తలుపు తట్టెను. లోపలినుండి ప్రశ్న వినవచ్చెను:- "ఎవరు?"

బైటినుండి సమాధానము వెళ్ళెను:- "దేశాధిపతియగు హారూణ అల్ రసీదు."

లోపలినుండి:— ఎంతయో ధన్యుడను. తమరు దయచేసిరా! ముందు తెలిసియున్నచో నేనే తమచెంతకు వచ్చియుండెడివాడనే.

చక్రవర్తి:— నేను కలిసికొనదలచినవ్యక్తి ఈతడు కాడు. (ఏలనన ఇతడు మాయావిశిష్టుడగు జీవుడు.)

సూఫియార్:— తమరు కలసికొనదలచిన వ్యక్తి ఫజలు అయి ఉండును." తదుపరి వారందరును ఫజల్ ఇంటికి వెళ్ళిరి. ఆసమయమున ఫజుల్ కురానునందలి ఈవాక్యమును ఉచ్చరించుచుండెను:-

"తమనుకూడ దేవుడు ధర్మాత్ములనుకొనవలెనని దుర్మార్గులు తలచెదరు."

చక్రవర్తి :— ఓహో! నాకు ఉపదేశించుటకు ఈఒక్క వాక్యమే చాలును. ఫజలు తనఇంటికివచ్చిన చక్రవర్తితో, వచ్చిన కారణ మడిగి ఇట్లనెను:-

"నేను చేయుచున్నపనికి అభ్యంతరము కలుగజేసి నన్ను ఇతర విషయములపైకి త్రిప్పకుడు."

చక్రవర్తియొక్క మిత్రుడు :— "దేశపుచక్రవర్తిని గౌరవించవలెను."

ఫజలు:— "నాపనికి విఘ్నములు కలుగజేయవద్దు."

తరువాత కుటీరములోనికి ప్రవేశించుటకు వారికి అనుమతి లభించెను. కాని హారూణ అల్ రసీదు ముఖము చూడరాదను ఉద్దేశ్యముతో ఫజలు దీపమును ఆర్పివేసెను. హారూణతో చీకటిలోనే కరచాలనముచేసి ఇట్లనెను:- ఎంత కోమలమైనహస్తములు. ఈచేతులు నరకాగ్నినుండి ముక్తిని పొందవలెను.

ఇట్లుపలికి ఫజలు నమాజునందు నిమగ్నుడయ్యెను. చక్రవర్తి రోదనముచేయుచు పలికెను:— ఇంకను ఏమైన చెప్పుడు.

నమాజు పూర్తి అయినపిమ్మట ఫజలు పలికెను:— మీతండ్రి పైగంబరగు హజరత్ మహమ్మదునకు పినతండ్రి. ఆయన పైగంబరును ఖలీఫాపదవిని తీసికొనమని బ్రతిమాలెను. అంతట పైగంబరు ఇట్లు పలికెను:—

"చిన్నాన్నగారూ! ఖలీఫాగా వేయిసంవత్సరములు సేవ చేయుటకంటె జీవితమును దేవుని సేవలో నుపయోగముచేయుట ఎంతయో మంచిది." దేశాధిపత్యముకంటె మనస్సుపై ఆధిపత్యము మంచిది.

ఇంకను ఏమైనచెప్పుడని ఖలీఫా ఫజలును అడిగెను:—

ఉమరుఅబ్దుల్ అజీజు సింహాసనము అధిష్ఠించినప్పుడు అబ్దుల్లా కుమారుడు సాలమును, ఇయుతుకుమారుడు రేఝాను, కాబేరు కుమారుడు మహమ్మదును ఖలీఫాపదవికి వచ్చినందున తాను ఆచరించవలసిన కర్తవ్యమును అడిగెను.

వారిలో ఒకడు పలికెను:—

"మీరు పరలోకపుదండననుండి ముక్తిని పొందదలచినచో వృద్ధులను తండ్రితో సమానముగా చూచుకొనవలెను. యువకులను బంధువులుగను, బాలురను వాత్సల్యముతోను, స్త్రీలను సోదరీసములుగను, మాతృసములుగను చూడవలెను."

చక్రవర్తి ఏడ్చుచుచునే యుండెను.

"దేవుడనిన భయపడవలెను. అపవిత్రతతో నుండుము. ప్రజలకు మేలు కోరుము. మీ రాజ్యములో ఒక్కడైనను ఆకలితో అన్నము లేకుండయున్నచో, రాత్రి నిద్రను ఆ కారణముచే కోల్పోయినచో ఆతడు దేవునిదర్బారులో మీపైన ఫిర్యాదుచేయును."

ఈవాక్యములు వినుటతో చక్రవర్తి ఏడుపు ఇంకను పెరిగిపోయెను. చక్రవర్తి స్నేహితుడు ఫజలుతో పలికెను:— "మీరు చక్రవర్తిని చంపివేయుచున్నారు."

చక్రవర్తి ఈమాటలు విని ఇంకను అధికముగా ఏడ్వ మొదలిడెను.

చక్రవర్తి:—"మీరు ఏమైన ఎవరికైన ఋణము తీర్చవలసి యున్నదా?"

ఫజలు:—అవును. నేను ప్రభువునకు చాల ఇవ్వవలసి యున్నది. ఆయన ఋణమును నేను తీర్చుకొనలేకపోతే అదిఎంతయో సిగ్గుపడవలసిన సంగతి.

చక్రవర్తి:—ఇది నిజమే. కాని నేనడుగునది వేరు. తమరు జనులకు ఇవ్వవలసినది ఏమయినకలదా?

ఫజలు:—ప్రభువు కృపచే నాకు అపారమగు సంపద లభించినది. ఆయనకు అసంఖ్యాకములగు ధన్యవాదములు. ఆఋణము అనుమాట నాకు అవసరము లేకపోవుచున్నది.

అటుతరువాత ఒకవేయి బంగారునాణెములు ఫజలు ఆసనము వద్దనుంచి చక్రవర్తి పలికెను:—ఇవి తప్పుడు మార్గమున సంపాదించలేదు. నాకు మాతల్లిగారు ఇచ్చినసంపద. తమరు కృపతో స్వీకరించుడు.

ఫజలు:—(అనిష్టముతో) నేను నీకు ఇంతచెప్పినను ఏమియు ప్రయోజనము లేకపోయెను. ఇంకను ఇట్టి దురాలోచనలును, దుష్కార్యములును చేయుచునే ఉన్నావు. నేను నీభారమును తగ్గించగోరుచున్నాను. నీకు ఔన్నత్యమును, ముక్తి లభించుమార్గమును చూపించుటకు ప్రయత్నించుచున్నాను. కాని నీవు అందుకు వ్యతిరేకముగా ఇంకను భారము పెంచుకొని నన్నుకూడ నరకములో పడ

వేయ జూచుచున్నావు. ఇదిగో నేను చెప్పునది వినుము. నీది అనునది నీకు ఏమైన ఉన్నచో ప్రభువునకు సమర్పించుము: కాని నీవు ఎవనికి ఇచ్చుటకూడదో వానికి ఇచ్చుచున్నావు. అరరే! నా ఉపదేశములు నీకు ఏమియు ఉపయోగించనేలేదే!... ”

ఇట్లు పలుకుచు ఫజలు లేచినిలబడెను. కుటీరద్వారమును మూసివేయుట ఆయన అభిప్రాయము అని ఖలీఫా తెలిసికొని బైటికి వచ్చెను. తలుపు మూయబడెను. బైటికివచ్చి ఖలీఫా పలికెను:—
ఆహా! ఈమహాపురుడే నిజముగ పవిత్రపురుషుడు.

ఇది అంతయు విని వాంసదామహారాజావారు ఎంతయో సంతసించి యిట్లు పలికిరి. మహాత్ముడగు ఫజలువంటివారే శ్రీనిత్యానందులవారుకూడను. నాకెన్నియో సదుపదేశములు వారివల్ల లభించినవి. నేను ప్రజలను సుఖపెట్టుటకు ఎంతైనా ప్రయత్నింతును. పిమ్మట మహారాజావారు వాంసదా వెళ్ళిపోయిరి.